క్లుప్తంగా

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయం వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆలయాన్ని సందర్శించి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు మల్లాడి బుజ్జి, కావలి నాని, చిట్టూరి కృష్ణ,అర్బన్‌బ్యాంకు చైర్మన్ ద్వారా హేమకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా భాగవత సప్తాహ మహోత్సవాలు



రాజగోపాలస్వామి ఆలయంలో మురళీకోలాటం చేస్తున్న చిన్నారులు

నరసాపురం రూరల్: మొగల్తూరులో ఉన్న శ్రీరాజగోపాల స్వామివారి ఆలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన మురళీ కోలాటం అందరినీ అలరించింది. ఆలయంలో జరగుతున్న భాగవత సప్తాహ మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం హరే శ్రీనివాస భజనమండలి ఆధ్వర్యంలో మురళీ కోలాట నృత్య ప్రదర్శన చేశారు. చిన్నారులు భక్తి గీతాలతో చేసిన ఈ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. హరే శ్రీనివాస భజన మండల గురువు పరాయతం నారాయణాచార్యులు, నల్లాని చక్రవర్తుల వాసుదేవ ఫణి, పులపర్తి రాజు తదితరుల ఆధ్వర్యంలో చిన్న పిల్ల కోలాటం నిర్వహించారు.

సిద్ధాంతంలో ప్రజారక్షణ భేరి యాత్ర



సిద్ధాంతంలో ప్రజారక్షణ భేరి యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సీపీఎం ఆధ్వర్యంలో సిద్ధాంతంలో ఆదివారం ప్రజా రక్షణ భేరి యాత్ర నిర్వహించారు. ఈ నెల 15న విజయవాడలో నిర్వహించబోయే ప్రజా రక్షణ బేరీకి అందరూ హాజరు కావాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆకుల హరేరామ్, మండల కార్యదర్శి సూర్నిడి వెంకటేశ్వరరావు, మండల కమిటీ సభ్యుడు కప్పల రత్నరాజు, నీలాపు ఆదినారాయణ, గుర్రాల సత్యనారాయణ పాల్గొన్నారు.

రత్నరాజు సేవలు ఎనలేనివి



కొంతేరులో మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ

యలమంచిలి: కొంతేరు యూత్ క్లబ్ సలహాదారునిగా గ్రామంలోని గత 5 దశాబ్దాలుగా విశిష్ట సేవలందించడంతో పాటు చిత్రకారుడిగా ఎంతో మందిని డ్రాయింగ్ టీచర్లుగా తీర్చిదిద్దిన బొందా రత్నరాజు సేవలు అభినందనీయమని యూత్ క్లబ్ అధ్యక్షుడు అంబటి మురళీకృష్ణ అన్నారు. ఇటీవల మరణించిన రత్నరాజు సంతాప సభ ఆదివారం పులపర్తి వీరాస్వామి యూత్‌క్లబ్ కళామందిర్‌లో నిర్వహించారు. 1971లో ప్రారంభించిన యూత్ క్లబ్ లోగోను చిత్రీకరణ చేసి క్లబ్‌కి ఎన్నో సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు బోనం రవిబాబు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ జక్కంశెట్టి సుభాష్‌చంద్రబోస్, మాజీ చైర్మన్ నిమ్మకాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురంలో శాకాహార ర్యాలీ

నరసాపురం రూరల్: పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శాకాహార ర్యాలీ నిర్వహించారు. నరసాపురం పట్టణానికి చెందిన పలువురు ధ్యానులు శాత్వికమైన ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పుర వీధుల్లో నినాదాలు చేశారు. మాస్టర్ భారతి శాఖాహార ప్రాముఖ్యతను వివరిస్తూ పాటలు పాడారు. సుభాష్ పత్రీజీ చెప్పిన శ్వాసమీద ధ్యాన ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించడం సాధ్యపడుతుందని పాట రూపంలో వివరించారు.

గ్రామాల్లో మురుగు సమస్యకు చెక్

- గడపగడపకు నిధులు దోహదం
- డ్రెయినేజీ సమస్య పరిష్కారమే ధ్యేయం



ములపర్రు పితాని వారి పాలెంలో నిర్మించిన డ్రెయినేజీ



సీతారాముని చెరువులో నిర్మించిన డ్రెయినేజీ



పెనుగొండ బాపూజీ పురంలో నిర్మాణ దశలో డ్రెయినేజీ



వడలిలో డ్రెయినేజీ నిర్మాణం

పెనుగొండ : ఎన్నో ఏళ్లుగా మురుగు సమస్యతో సతమతం అవుతున్న గ్రామాల్లో సత్వర పరిష్కారానికి నిధులు మంజూరు కావడంతో మురుగు డ్రెయిన్ల నిర్మాణాలు వేగంగా జరుగుతుంది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మురుగు సమస్యలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి ఆయా గ్రామాల్లో ప్రజలు తీసుకురావడంతో వాటి నిర్మాణానికే ప్రథమ ప్రాధాన్యత నిస్తూ నిర్మాణాలు ప్రారంభించారు. మండలంలో 20 సచివాలయాల పరిధిలో ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు నిధులు మంజూరు కావడంతో, వీటికి మండల పరిషత్ సాధారణ నిధులు, 15వ ప్రణాళిక సంఘ నిధులు జోడించి డ్రెయినేజీ సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు.

నిర్మాణాలు ఇలా

ములపర్రు పితానివారి పాలెం, సీతారాముని చెరువుల్లో రెండు దశాబ్దాలకు పైగా డ్రెయినేజీ సమస్యతో సతమతం అవుతున్నారు.దీంతో పితానివారి పాలెంలో రూ.13 లక్షలు, సీతారాముని చెరువులో రూ.10 లక్షలతోనూ నిర్మాణాలు పూర్తి చేశారు. పెనుగొండ అంబేడ్కర్ కాలనీలోనూ రోడ్డుపై మురుగు పారుతూ ప్రజలను నానా ఇబ్బందులు గురిచేసేది. రూ.14 లక్షలతో నిర్మాణం పూర్తి చేశారు. పెనుగొండ బాపూజీ పురంలోనూ రూ.13 లక్షలు, వడలిలో రూ.10 లక్షలతోనూ నిర్మాణాలు చేపట్టారు. దీంతో పాటు సీతారాముని చెరువులో మరో రూ.10 లక్షలతోనూ, మారేమ్మ గూడెంలో రూ.10 లక్షలతోనూ, పెనుగొండ శివాలయం వీధి, లింగాల వీధిల్లోనూ రూ.8 లక్షలతోనూ డ్రెయినేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలు చేశారు. సిద్ధాంతంలో గరగాలమ్మ డ్రెయినేజీ సమస్యతో ప్రజలు సతమతం అవుతుండడంతో ప్రతీ వర్షాకాలంలోనూ సిద్ధాంతం సగభాగం మురుగునీటితోనే నిండిపోతుండడంతో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆదేశాలతో యుద్ధప్రాతిపదిక నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు.

ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు



సీతారాముని చెరువులో ఎన్నో ఏళ్లుగా డ్రెయినేజీ సమస్యతో సతమతమవుతున్నాం. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు హామీతో డ్రెయినేజీ కల నెరవేరింది. ఇప్పటికే రూ.10 లక్షలతో కొంత భాగం పూర్తి చేశారు. మరో రూ.10 లక్షలు మంజూరు చేశారు. డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి సహకరించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు

– ఊటాల ధర్మారావు, సీతారాముని చెరువు

పూర్తయిన పీచుపాలెం రోడ్డు



పూర్తయిన పీచుపాలెం రోడ్డు

నరసాపురం: పట్టణంలోని పీచుపాలెం ఆదిత్య స్కూల్ వద్ద రూ 10 లక్షలతో మొదలు పెట్టిన రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు ప్రతీరోజూ వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. అలాగే పలు గ్రామాల వారు కూడా ఈ ప్రాంతంలో నిత్యం ప్రయాణిస్తుంటారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఈ ప్రాంతంలో నిర్వహించినప్పుడు స్థానికులు రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. దీంతో ముదునూరి రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అలాగే మరో రూ 1.50 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో కల్వర్టు నిర్మాణం కూడా చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు.

పాలకొల్లులో చాంబర్ కృషి అభినందనీయం



వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గోపిను సత్కరిస్తున్న వర్తక ప్రముఖులు

పాలకొల్లు అర్బన్: చాంబర్ ఆఫ్ కామర్స్ వర్తకుల వ్యాపార ధృక్పథంతో కాకుండా సామాజిక సేవా భావంతో పాలకొల్లు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ప్రశంసించారు. ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ భవనంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి, టీటీడీ బోర్డు మెంబర్ మేకా శేషుబాబు, దెందులూరి పార్టీ పరిశీలకులు యడ్ల తాతాజీలను శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా గుడాల గోపి మాట్లాడుతూ తాను పాలకొల్లు ప్రజలకు సేవలు చేయడానికి వచ్చానని, తన సేవలపై సంతృప్తి చెందితేనే తనకు ఓటు వేయాలని కోరారు. అలాగే పాలకొల్లు వర్తకులకు ఏ సమయంలో ఏ అవసరం ఉన్నా తక్షణం స్పందిస్తానని హామీ ఇచ్చారు. కుళాయి చెరువు గట్టును ఆనుకుని ఉన్న లీకేజీ బోదెలోకి పబ్లిక్ ట్యాంకర్లతో మలాన్ని వదిలేస్తున్నారని, కులాయి చెరువు గట్టుపై వాకింగ్ చేస్తున్న ప్రజలు దుర్వాసన భరించలేక పోతున్నారని గుడాల గోపి దృష్టికి వర్తకులు తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి తక్షణం పబ్లిక్ ట్యాంకర్లను అక్కడ నుంచి తొలగించి ఆ ప్రాంతంలో ముగ్గు, బ్లీచింగ్ చల్లించాలని మునిసిపల్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహారావు, కార్యదర్శి దేవరపు లక్ష్మీనారాయణ, కోశాధికారి నెలకుర్తి వెంకట సత్యనారాయణ, గౌరవ సలహాదారులు వేగేశ్న రంగరాజు, గుణ్ణం సర్వారావు, కార్యదర్శి మామిడి వెంకటేశ్వరరావు (బాబు), ఉపాధ్యక్షుడు రేపూరి సూర్యనారాయణ, సన్నిశెట్టి లీలాభవన్నారాయణ పాల్గొన్నారు.

దూరప్రాంతాలకు వెళ్లి పింఛన్ పంపిణీ



కాకినాడలో పింఛన్ అందిస్తున్న కొడమంచిలి వలంటీరు వెంకటరమణ

పెనుగొండ: లబ్ధిదారులు గ్రామాల్లో లేకపోయినా, జిల్లాలు దాటి ఆసుపత్రులుకు వెళ్లి పింఛన్ అందించి వలంటీర్లు వృద్ధుల కళ్లలో ఆనందాన్ని చూస్తున్నారు. ఆచంట మండలం కొడమంచిలికి చెందిన గోపరాజు భాస్కరరావు అనారోగ్యంతో కాకినాడలో కుమారుడు వద్ద ఉండడంతో వలంటీరు పెచ్చెట్టి వెంకట రమణ లబ్ధిదారుడు చెంతకు వెళ్లి పింఛన్ అందించి వారి మన్ననలు పొందారు. వలంటీరు ను ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిరా సీతారామ్, ఎంపీటీసీలు చిలుకూరి నాగ దుర్గా భవానీ, యల్లమెల్లి బేబీ రాజేష్‌లు, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్‌లు అభినందించారు. అలాగే వడలికి చెందిన అంగర లక్ష్మీ కాంతం రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటుండడంతో వలంటీరు ఉమాదేవి రాజమండ్రి వెళ్లి పింఛన్ అందించారు. సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి గణేష్, చిటికెన గంగాభవానీ బాబీ, కాసాని శ్రీనివాసరావు అభినందించారు.

మల్లవరంలో..

నరసాపురం రూరల్: మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన గూడూరి చల్లారావు గత కొంత కాలంగా అనారోగ్యం కారణంతో మొగల్తూరు మండలం ముత్యాలపల్లి లోని కుమార్తె వద్ద ఉంటున్నాడు. పింఛన్ సొమ్ములు తీసుకునేందుకు గ్రామానికి వచ్చే ఓపిక లేక రావడం లేదు. దీంతో మల్లవరం గ్రామం నుంచి వలంటీర్ పిల్లి సారిక ఆదివారం సుమారు 22 కిలోమీటర్ల దూరంలోని ముత్యాలపల్లి వెళ్లి పింఛన్ అందించింది.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

సాక్షి, భీమవరం: మతి స్థిమితంలేని స్థితిలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వృద్ధురాలు చికిత్సపొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం గునుపూడికి చెందిన జవ్వాది గంగాభవాని (62)కి మతిస్థిమితం లేదు. ఈనెల 2న ఇంటి వద్ద పురుగుల మందు తాగడంతో చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. మెరుగైన చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శనివారం రాత్రి అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఏఎస్సై ఎం.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పన



నరసాపురం రూరల్: ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ ప్రశాంతి



యలమంచిలి: అడవిపాలెంలో ఓటర్లతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి అప్పారావు



పోడూరు: జిన్నూరులో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు

నరసాపురం రూరల్: ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. దీనిలో భాగంగా చేర్పులు, మార్పులతో పాటు డూప్లికేట్, చనిపోయిన వారి ఓట్లు తొలగించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరు జాబితా పరిశీలించి ఓటు హక్కు ఉందో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. ఓటరు జాబితా పక్కాగా తయరు చేయడానికి అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. మొగల్తూరు మండలంలోని ముత్యాలపల్లి ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత అంబరీష్‌తో కలసి ఆదివారం ఆమె పరిశీలించి బీఎల్ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాకు పూర్తి బాధ్యత బీఎల్ఓలదేనని తెలిపారు. ఓటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలని పేర్లు సవరణ, చేర్పులు, మార్పులు అన్ని దరఖాస్తులు తీసుకోవాలని సూచించారు. జాబితాలో అక్కడక్కడా ఫొటోలు లేకుండా ఉన్న ఓటర్లను గమనించి ఫొటోలను తప్పకుండా అప్లోడ్ చేయాలని ఆమె సూచించారు. ఫారం-6, ఫారం-8లు ఎన్నెన్ని వచ్చాయి? ఎలా పరిష్కరించారు? అని కలెక్టర్ బీఎల్ఓలను ప్రశ్నించారు. స్పెషల్ క్యాంపెయిన్ తరువాత ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాల క్రాస్ చెక్ చేసి చూడాలని సూచించారు. అర్హులైన ప్రతీ ఒక్కరినీ ఓటర్లుగా చేర్పించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి కోరారు. ఆమె వెంట నరసాపురం ఆర్డీఓ అచ్యుత అంబరీష్, తహసీల్దార్ బి.అనిత కుమారి తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లకూడదు

పాలకొల్లు అర్బన్: తప్పులు లేని కచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. మండలంలోని దిగమర్రులోని పోలింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియను ఆదివారం ఆమె పరిశీలించారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి బీఎల్ఓలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పోలింగ్ సమయంలో ఓటర్ల జాబితాలపై సమస్యలు తలెత్తితే బీఎల్ఓలు బాధ్యత వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్డీఓ డా.ఎం అచ్యుత అంబరీస్, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఓటరు తమ ఓటును పరిశీలించుకోవాలి

యలమంచిలి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాలకొల్లు నియోజకవర్గంలోని 191 పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ఓటర్ల ముసాయిదా జాబితా ప్రదర్శనకు ఉంచామని నియోజకవర్గ ఎన్నికల అధికారి కేసీహెచ్ అప్పారావు చెప్పారు. అడవిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితా ప్రత్యేక శిబిరాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఓటర్లతో మాట్లాడుతూ ప్రతీ ఓటరు తమ ఓటును సరిచూసుకోవాలని కోరారు. ఓటర్ల జాబితాలో తమ పేరు లేకపోతే ఫారం 6, ఓటరు మరణించినతో ఫారం 7, పేర్లలో తప్పు ఉన్నా, చిరునామా మారినా ఫారం 8 దరఖాస్తులను డిసెంబర్ 9లోపు సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని కోరారు. డిసెంబర్ 27న ఓటర్ల జాబితా చివరి ప్రచురణకు పంపుతామన్నారు. జనవరి 5న కొత్త ఓటర్ల జాబితా ప్రకటిస్తామని ఆయన చెప్పారు. ఆయన వెంట తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, ఎలక్షన్ డీటీ బ్రహ్మాజీ, బీఎల్‌వోలు కొల్లాటి నరేష్, త్సవటపల్లి మంజు, నారాయణ తదితరులు ఉన్నారు.

ఓటు నమోదు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పోడూరు: ఓటు నమోదు ప్రత్యేక శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు కోరారు. జిన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం పోలింగ్‌బూత్‌ల వారీగా నిర్వహించిన ఓటు నమోదు ప్రత్యేక శిబిరాలను ఆయన సందర్శించారు. ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు నమోదు చేయించుకునేందుకు, ఓటు తొలగింపు, ఓటరు కార్డులో సవరణలకు వీలుగా ఓటు నమోదు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఐ కె.రాంబాబు, బీఎల్ఓలు తహసీల్దార్ వెంట ఉన్నారు.

నేడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు కార్యక్రమ వివరాలను పేర్కొంటూ సబ్‌కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎం.అచ్యుత్ అంబరీష్ స్వీకరిస్తారు. డివిజన్‌స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల పేటతుల్లి



నరసాపురంలో ఆకట్టుకున్న వేషధారణలు

నరసాపురం రూరల్: పట్టణంలోని పార్కురోడ్డులోని అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా పేటతుళ్లి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడు, అయ్యప్ప స్వామి, ఆంజనేయస్వామి, కుమారస్వామి వేషధారణలతో పాటు విచిత్ర వేషధారణలతో మెయిన్‌రోడ్డు, వలందర్‌రేవు, లలితాంబరేవు, స్టీమర్‌రోడ్డు, శ్రీలక్ష్మి సెంటర్ ప్రాంతాల్లో పేటతుళ్లి కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు సుమారు 130 మంది పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ కోలాటం, నిర్వహిస్తూ అయ్యప్ప నామాన్ని కీర్తిస్తూ భజనలు చేశారు. తొలుత పార్కు రోడ్డు సాయిబాబా ఆలయం వద్దనున్న అయ్యప్ప పీఠం నుంచి ప్రారంభమైన ఈ పేటతుళ్లి కార్యక్రమం మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ నిర్వహించారు. అనంతరం రాత్రి భజనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు ద్వారా రాము, జనార్ధనస్వామి తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి



పోడూరు: వద్దిపర్రులో బస్సు యాత్ర పై ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



పాలకొల్లు అర్బన్: ఏఎంసీ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్

పోడూరు: రాష్ట్రంలో పార్టీలు, వర్గాలు, కుల మతాలకు అతీతంగా అన్నివర్గాలకు సమతూకంగా సంక్షేమ ఫలాలను అందిస్తున్న సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్‌సీపీ మండల ఇంఛార్జి పితాని సత్యనారాయణ(చిన్నా) పిలుపునిచ్చారు. రావిపాడు, వద్దిపర్రు గ్రామాల్లో ఆదివారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి పర్యటించి సామాజిక సాధికార బస్సుయాత్రపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ ఈ నెల 8న పూలపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభమై గాంధీ బొమ్మల వరకు కొనసాగుతుందనీ, గాంధీబొమ్మల సెంటర్‌లో బహిరంగ సభ ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ బళ్ల రాజశేఖర్, వడ్లపాటి సురేష్, అందే నాగేశ్వరరావు, వడ్డి సంజయ్‌కుమార్, జల్లి మురళీకృష్ణ, వాసా చంద్రశేఖర్, అధికారి చంటి, వడ్లపాటి ఆనందరాజు, మామిడిశెట్టి వెంకట్రావు, వడ్లపాటి సుధాకర్, మామిడిశెట్టి భద్రయ్య, కుక్కల వెంకటేశ్వరరావు, బద్దా శరత్ పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ ఫలాలు

పాలకొల్లు అర్బన్: పేదలకు సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ అన్నారు. పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 8వ తేదీన పాలకొల్లులో జరిగే సామాజిక సాధికారిక బస్సు యాత్రకు పాలకొల్లు నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు వేలాదిగా తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చినిమిల్లి గణపతి రావు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని పేదల సంక్షేమం కోసం చేసిన మేలులు వివరించే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 8వ తేదీన నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్రకు యువజనులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు కోరారు. వైఎస్సార్ సీపీ నియోజవకర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) ఆదేశాల మేరకు మండలంలోని లంకలకోడేరు, ఉల్లంపర్రు గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి యువజనులు, మహిళలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కూనపరాజు చంటిరాజు, కర్ణి జోగయ్య, దేవ ప్రసాద్, రౌతు కృష్ణ, ఉల్లంపర్రు మాజీ సర్పంచ్ రావాడ సతీష్, కాటంరెడ్డి రామారావు పాల్గొన్నారు.

యాళ్లవానిగరువులో...

వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు యాళ్లవానిగరువులో ఆదివారం స్థానిక యువజనులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. బస్సుయాత్రకు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. మాజీ సర్పంచ్ గంటా నరేష్, పార్టీ నాయకులు మరపట్ల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని శంభునిపేటలో మహిళా నాయకురాలు మద్దా చంద్రకళ, ఎస్సీ సెల్ యువజన అధ్యక్షుడు కోట రత్నంరాజు తదితరులు బస్సు యాత్ర కరపత్రాలన పంచారు.

సామాజిక సాధికారిక యాత్రలో పాల్గొనాలి

ఈ నెల 8న పాలకొల్లులో నిర్వహిస్తున్న సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో ప్రయోజనాలు కల్పించారని పేర్కొన్నారు.

మందాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయాభివృద్ధికి వడలికి చెందిన చప్పారామస్వామి కుమార్తె, విజయవాడలో ఉంటున్న వేముల పల్లి విజయలక్ష్మీ దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం విరాళాన్ని ఆలయార్చకులు రమణకు అందించారని, వీటిని అన్నదాన భవనం, ఇతర అభివృద్ధి పనులకు వినియోగించనున్నట్లు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసాపురం డివిజన్
9010223729 (ఆచంట)
9010201609 (నరసాపురం)
9505507552 (పాలకొల్లు)
Office mail : tpgadvt@gmail.com